# ‘కస్తూర్బా’లో నిలిచిన బోధన!

**సమ్మెలో సీఆర్‌టీలు**

- కొనసాగని తరగతులు
- దగ్గరపడుతున్న ‘పది’ పరీక్షలు
- ఆందోళనలో విద్యార్థినులు
- పట్టించుకోని అధికారులు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 23: కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో కొన్నిరోజులుగా బోధన తరగతులు కొనసాగడంలేదు. తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని కాంట్రాక్ట్ రెసిడెన్సియల్ ఉపాధ్యాయులు సమ్మెబాట పట్టడంతో.. కస్తూర్బా పాఠశాలల్లోని విద్యార్థులు చదువు చెప్పేవారు లేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మొత్తం 95 కస్తూర్బా గాంధీ పాఠశాలలు ఉండగా.. ఇందులో 5,576 మంది విద్యార్థినులు చదువుతున్నారు. జిల్లాలో సీఆర్‌టీలు 195 మంది ఉండగా.. ఇందులో 121 మంది ఈ నెల 10 నుంచి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ నిరవధిక సమ్మెలో ఉన్నారు. దీంతో పాఠశాలల్లో సబ్జెక్ట్‌ల వారీగా పాఠ్యాంశాలు బోధించేవారు లేక తరగతులు కొనసాగడంలేదు.

### ‘పది’ విద్యార్థుల ఆందోళన

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు పూర్తి చేసి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. కానీ కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థినులకు అసలు సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలు పూర్తి కాలేదు. ప్రత్యేక తరగతులు కూడా ముందుకుసాగడంలేదు. దీంతో పదో తరగతి విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. కలెక్టర్ స్పందించి ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి విద్యార్థులకు బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

### పాఠాలు బోధించేవారు లేక ఇబ్బందులు



కాంట్రాక్ట్ టీచర్లు సమ్మెలో ఉండడంతో..చదువు ముందుకు సాగడంలేదు. పాఠాలు చెప్పేవారు లేక ఖాళీగా కూర్చొంటున్నాం. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయి. పాఠాలు మొత్తం పూర్తి కాలేదు. పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పాఠాలు పూర్తి చేసి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు వెంటనే పాఠాలు బోధించి, మాకు నష్టం జరగకుండా చూడాలి.

**-తలారి మేఘన (పదో తరగతి) కస్తూర్బా పాఠశాల**

### వెంటనే బోధన ప్రారంభించాలి..



ఉపాధ్యాయులు సమ్మెలో ఉండడంతో పాఠాలు బోధించేవారు లేరు. పరీక్షలు సమీపిస్తుండడంతో భయంగా ఉంది. 13 రోజులుగా పాఠాలు జరగడం లేదు. ఇలా ఐతే మేము ఎలా పాస్ అవుతామో అర్థం కావడం లేదు. అధికారులు స్పందించి పాఠ్యాంశాలు చెప్పేలా చర్యలు తీసుకోవాలి. లేదంటే ఇక్కడ ఉండి చదువుకోవడం చాలా కష్టంగా ఉంది.

**-సూరెపల్లి అర్చన (పదో తరగతి) కస్తూరా విద్యాలయం**

### డిప్యుటేషన్‌పై టీచర్లను ఏర్పాటు చేయాలని సూచించాం

కస్తూర్బా పాఠశాలల్లో విధులు నిర్వర్తించే సీఆర్‌టీలు ఈనెల 10 నుంచి సమ్మెలో ఉన్నారు. దీంతో నలుగురు తాత్కాలిక ఉపాధ్యాయులతో బోధన కొనసాగుతున్నది. పాఠ్యాంశాలు ముందుకు సాగక విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, డీఈవో దృష్టికి తీసుకువెళ్లాం. మండలంలోని సబ్జెక్టుల వారీగా టీచర్లను డిప్యుటేషన్‌పై కస్తూర్బా పాఠశాలలకు పంపించి సబ్జెక్టులు పూర్తి చేయాలని ఎంఈవోలకు సూచించాం. కానీ ఇప్పటి వరకు ఎవరూ స్పందించడం లేదు.

**- సుకన్య, జీసీడీవో, కామారెడ్డి**



నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయురాలు లేక పీడీ పర్యవేక్షణలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థినులు

**రెచ్చిపోతున్న ఇసుకాసురులు**


- అక్రమ రవాణాపై కండ్లు మూసుకున్న పోలీసులు
- అక్రమార్కులకు పరోక్షంగా సహకారం
- సర్కారు ఆదాయానికి భారీగా గండి...
- బోధన్, బాల్కొండ, జుక్కల్‌లో యథేచ్ఛగా తవ్వకాలు
- తెర వెనుక చక్రం తిప్పుతున్న అధికార పార్టీ నేతలు
- మామూళ్ల మత్తులో మైనింగ్, రెవెన్యూ అధికారులు

# ఇసుక దోపిడీకి అడ్డుకట్టేది?

**ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోతున్నది.** ఇసుక దోపిడీని అడ్డుకునేందుకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. ఇసుకాసురులు లెక్కచేయడంలేదు. ఉమ్మడి జిల్లాలో వాగులు, వంకలు, కుంటల నుంచి నదీ పరీవాహక ప్రాంతాల వరకు ఇసుకను తోడేస్తున్నారు. ఎలాంటి అనుమతులూ లేకుండా యథేచ్ఛగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ అక్రమ దందా వెనుక అధికార పార్టీ నేతల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతుండగా.. పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

–నిజామాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)





మోర్తాడ్ మండలం గాండ్లపేట్ నుంచి అక్రమంగా ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న ఇసుక

**ఇసుకాసురులతో** చేతులు కలిపిన 12మంది పోలీసులపై చర్యలకు సిఫార్సు చేసినప్పటికీ, ఎక్కడా మార్పు కనిపించకపోవడం గమనార్హం. కొందరు పోలీసులపై బదిలీ వేటు వేసినా వారిలో మార్పు కానరావడంలేదు. ఇసుక అక్రమ రవాణాపై ఉన్నతాధికారుల నుంచి కూడా స్పందన కరువైంది. నిజామాబాద్‌కు సీపీ లేకపోవడంతో కామారెడ్డి ఎస్పీ సింధూశర్మకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆమె సీపీ హోదాలో ఉన్నప్పటికీ కింది స్థాయిలో అక్రమాల వ్యవహారాలకు ఎక్కడా చెక్ పడడం లేదు. కామారెడ్డి జిల్లాలోని మంజీరా పరీవాహక ప్రాంతంతోపాటు నిజామాబాద్ జిల్లా బోధన్, బాన్సువాడ, బాల్కొండ నియోజకవర్గాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. అడ్డుకునే వారు లేకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతున్నది.

### జరిమానాలపై ఉన్న శ్రద్ధ.. ఇసుక వాహనాలపై ఏదీ?

నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో గత సీపీ కాలం నుంచి హెల్మెట్ ధరించకపోవడంతోపాటు ప్రజల ప్రయోజనం పేరిట వేగ నియంత్రణలోనే వెళ్లే వాహనాలపై ఎడాపెడా జరిమానాలను పోలీసులు విధిస్తున్నారు. హెల్మెట్ పెట్టుకోకపోతే భారీగా జరిమానాలు విధిస్తున్న సమయంలో నంబర్ ప్లేట్ లేకుండా ఇసుక, మొరం వాహనాలు నగరంలో చక్కర్లు కొడుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు మైనింగ్ శాఖ అనుమతులు మంజూరు చేయని బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్, భీమ్‌గల్, బాన్సువాడ నియోజకవర్గంలోని పోతంగల్, బోధన్ నియోజకవర్గ కేంద్రంలో ఇసుక మేటలను కొల్లగొడుతున్న అక్రమార్కులపై ఖాకీలు ఎందుకు దృష్టి సారించడంలేదు. అధికార పార్టీ నేతలకు పోలీసు ఉన్నతాధికారులే కొమ్ము కాస్తూ ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మోర్తాడ్ పోలీస్‌స్టేషన్ ఎదుట నుంచే ఇసుకాసురులు ఇసుకను వాహనాల్లో రయ్..రుయ్ మంటూ తరలించడం గమనార్హం. బీర్కూర్‌లోనూ పోలీస్ ఠాణా ఎదుట నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నా అడ్డుకునే నాథుడు కరువయ్యాడు.

### 12మందిపై చర్యలేవీ?

పోలీసుల్లో కొంతమంది బరితెగించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుక పంచాయితీలు పోలీసు ఉన్నతాధికారుల చెంతకు వెళ్లినా డోంట్ కేర్ అన్నట్లుగా వ్యవహరిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఇసుక అక్రమరవాణాలో పాలుపంచుకున్న కారణంతో పదిమంది ఎస్సైలు, ఇద్దరు సీఐలపై నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు డీజీపీ మెమో జారీ చేశారు. అందులో ఈ 12 మందిపై బదిలీ వేటు వేసి వెంటనే విచారణ ప్రారంభించాలని పేర్కొన్నారు. సదరు 12 మందికి స్థాన చలనం జరిగినప్పటికీ వారిలో ఇప్పటివరకు ఎవరిపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోలేదు. బదిలీతోనే మమ అనిపించారు. ఎస్సై, సీఐల వక్రమార్గాన్ని స్థానికంగా ఉన్నతాధికారులు పసిగట్టలేక పోవడంతోనే డీజీపీ నుంచి ఆదేశాలు వచ్చాయని పోలీస్ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది. సీపీ నేతృత్వంలోనే కఠినమైన చర్యలు అమలు జరిగి ఉంటే అక్రమార్కులతో పోలీసులు చెట్టాపట్టాల్ వేసుకునే పరిస్థితి వచ్చేది కాదన్న భావన అందరిలోనూ కలుగుతోంది. డీజీపీ ఆదేశాలతో ఒకింత ఖాకీల్లో కలవరం మొదలైంది. కొంత కాలంగా తప్పు చేసేందుకు జంకే పరిస్థితికి వచ్చారు. రెవెన్యూ, మైనింగ్ శాఖలతో సమన్వయం చేసుకునైనా ఇసుక దందాను అడ్డుకుని ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని ప్రజలంతా కోరుకుంటున్నారు

## వాయుసేనలో ‘అగ్నివీర్’ దరఖాస్తుల ఆహ్వానం

కంఠేశ్వర్, డిసెంబర్ 23 : భారత వాయుసేన (ఇండియన్ ఎయిర్‌ఫోర్స్)లో అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేశారని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండి 2005 జనవరి 1 నుంచి 2008 జూలై 1 మధ్యన జన్మించి ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన వారు 2025 జనవరి 7 నుంచి 27 లోగా https://agnipathavy.cdac.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి 2025 మార్చి 22 నుంచి ఆన్‌లైన్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాకు చెందిన అర్హులైన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు



శక్కర్‌నగర్‌లోని నిజాంషుగర్ ఫ్యాక్టరీ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కార్మికులు, స్థానిక నాయకులు

## నిజాంషుగర్స్ ఎదుట కార్మికుల నిరసన

- ఫ్యాక్టరీ లేఆఫ్‌కు తొమ్మిదేండ్లు పూర్తి
- లేఆఫ్ కాలానికి వేతన బకాయిలు ఇప్పించాలి..
- ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని డిమాండ్

బోధన్, డిసెంబర్ 23: నిజాంషుగర్స్ శక్కర్‌నగర్, మెదక్, మెట్‌పల్లి యూనిట్లకు ప్రైవేట్ యాజమాన్యం అక్రమంగా లేఆఫ్ ప్రకటించి సోమవారం నాటికి తొమ్మిదేండ్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని నిజాంషుగర్ ఫ్యాక్టరీ మెయిన్‌గేట్ ఎదుట కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. 2015 డిసెంబర్ 23వ తేదీ అర్ధరాత్రి నిజాం షుగర్స్‌కు ప్రైవేట్ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించింది. అయితే లేఆఫ్ జరిగిన తొమ్మిదేండ్లకు చట్ట ప్రకారం చెల్లించాల్సిన వేతనాలను ప్రైవేట్ యాజమాన్యం ఇప్పటివరకు చెల్లించలేదు. దీంతో తమ వేతన బకాయిలను చెల్లించాలని, నిజాం షుగర్స్‌ను వెంటనే తెరిపించాలని డిమాండ్‌చేస్తూ కార్మికులు నల్లబ్యాడ్జీలతో ఫ్యాక్టరీ మెయిన్ గేట్ ఎదుట నిరసన తెలిపారు. నిజాం షుగర్స్‌ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇంతవరకు ఫ్యాక్టరీని తెరిపించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తంచేశారు. లేఆఫ్ కాలానికి తమ వేతన బకాయిలను ప్రభుత్వం ఇప్పించాలని వారు కోరారు. నిరసన కార్యక్రమంలో కార్మిక నాయకులు ఉపేందర్, నాగుల రవిశంకర్‌గౌడ్, బాలకృష్ణ, శ్రీనివాస్, రాంబాబు, ఈరవేణి సత్యనారాయణ, శ్రీధర్, దాస్, భూమయ్య, శివరాములు, భిక్షపతి, మాజీ కౌన్సిలర్ మిద్దెల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల వంట-వార్పు, హోమం

### ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న నిరసన



కామారెడ్డిలో యజ్ఞం చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

**తమ డిమాండ్లను** నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 14వ రోజుకు చేరుకున్నది. సమ్మెలో భాగంగా సోమవారం నిజామాబాద్‌లో వంట-వార్పు, కామారెడ్డిలో హోమం నిర్వహించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హన్మకొండలో సీఎం రేవంత్ ఇచ్చిన హామీ తాము నిర్వహించిన యజ్ఞం ద్వారా గుర్తుకురావాలని కోరారు. తమ సర్వీసును రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు తీవ్రమైన పనిభారం,ఒత్తిళ్లతో పనిచేస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొనాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలన్నారు.

–కంఠేశ్వర్/ కామారెడ్డి, డిసెంబర్ 23

## ఏడాది గడుస్తున్నా హామీల అమలేదీ?

**షరతులు లేకుండా జీవన భృతి అందించాలి**
**ఐఎఫ్‌టీయూ నాయకుల డిమాండ్**
**కామారెడ్డిలో బీడీ కార్మికులతో కలిసి భారీ ర్యాలీ**

కామారెడ్డి, డిసెంబర్ 23 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయడంలేదని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎలాంటి షరతులు లేకుండా బీడీ కార్మికులకు రూ. 4వేల జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో యూనియన్ ఆధ్వర్యంలో సీఎస్ఐ ప్రాంగణంలో సోమవారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే , బీడీ కార్మికులకు ఇస్తున్న జీవన భృతి పెన్షన్ రూ. 2,016 నుంచి రూ. నాలుగువేలకు పెంచి ఇస్తామని, అలాగే కొత్తగా దరఖాస్తు చేసుకున్న కార్మికులకు కూడా ఎలాంటి షరతులు లేకుండా పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. బీడీ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులతోపాటు ప్యాకర్లు, నెలసరి జీతాల ఉద్యోగులందరికీ చేయూత పథకం ద్వారా పెన్షన్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటి, కామారెడ్డి జిల్లా బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రకాశ్, బాలరాజు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్, నాయకులు సాయాగౌడ్, సాయికుమార్, మురళి, గంగారాం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.




కామారెడ్డిలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు, బీడీ కార్మికులు

## యాడారంలో విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

బీబీపేట్, డిసెంబర్ 23: మండలంలోని యాడారం గ్రామంలో ఓ రైతు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. సోమవారం స్థానిక ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాడారం గ్రామానికి చెందిన వడ్ల సీతారాములు(57) ఆదివారం వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లాడు. ఒడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా అకస్మాత్తుగా కాలుజారి పొలంలో పడిపోతుండగా పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం నుంచి బోర్‌స్టార్టర్‌కు ఏర్పాటు చేసిన కరెంట్ తీగను పట్టుకున్నాడు. దీంతో విద్యుత్ తీగ తెగిపోవడంతో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య వడ్ల చిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.